

పారిశుధ్య కార్మికులకు పీపీటీ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

పారిశుధ్య కార్మికులకు పీపీటీ కిట్ల పంపిణీ

హయత్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఓల్డ్‌విలేజీలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత సంరక్షణ పరికరాల కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేస్తారని అన్నారు. వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందులో భాగంగానే పారిశుధ్య కార్మికులకు సంరక్షణ పరికరాల కిట్లను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. డివిజన్‌లో పరిసరాల పరిశుభ్రతను కాపాడడంలో పారిశుధ్య కార్మికులు కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ యాదయ్య, మల్లేష్, బీజేపీ నాయకులు అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బ్రహ్మాచారి, కమిటీ సభ్యులు

శ్రీరమణకాలనీ ఫేజ్-2 నూతన కార్యవర్గం

చంపాపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్డులోని శ్రీరమణకాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వాసుదేవరావు, సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అశోక్‌గౌడ్, కోశాధికారిగా గుర్నాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, మెంబర్‌గా ఇబ్రహీంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మల్లికార్జునరెడ్డి, సురేష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లింగంయాదవ్, జైపాల్‌రెడ్డి, జంగయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, యాదవరెడ్డి, నారాయణగౌడ్, వెంకటేష్‌నాయక్, వెంకట్‌రెడ్డి, దేవుడమ్మ, బ్రహ్మాచారి పాల్గొని నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. కాలనీ నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.



10కే రన్‌ను ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

క్రీడలన్నా.. క్రీడాకారులన్నా తనకెంతో గౌరవం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): క్రీడలన్నా.. క్రీడాకారులన్నా తనకు ఎంతో గౌరవమని, పేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తానెప్పుడు ముందుంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని డీఆర్ఎఫ్ ట్రైనింగ్ సెంటర్, ఇందు ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం తెలంగాణ హిస్టారికల్స్ 10కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా విచ్చేసి జెండా ఊపి 10కే రన్‌ను ప్రారంభించారు. ఈ రన్‌లో 200మంది పాల్గొనగా విజేతలకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాదర్‌ఘాట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో 1999-2000 పదో తరగతి సీ సెక్షన్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులకు ఆనాడు బోధన చేసిన ఆరుగురు ఉపాధ్యాయులు, 50మంది పూర్వ విద్యార్థులు అదే స్కూల్‌లోనే కలుసుకుని తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి స్కూల్లో చేసిన అల్లర్లు, ఆడిన ఆటలు, పాడిన పాటలు ఇలా ఎవరికి గుర్తుకు వచ్చిన జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. దాదాపు 25ఏళ్ల తర్వాత పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఒక చోటకు చేర్చడంలో ఎవరికి వారుగా తమ వంతు సహకారాన్ని అందించుకుని సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆరుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



చైతన్యపురిలోని సత్యనగర్‌లో గల నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పటేల్, పక్కన మున్నూరుకాపు సంక్షేమ సంఘం దిల్‌సుఖ్‌నగర్ కమిటీ అధ్యక్షుడు అనంతుల నవీన్ పటేల్, తోట రాజు పటేల్, వేణుగోపాల్ పటేల్ తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రీనగర్ బ్యాంక్‌కాలనీలోని రెవెన్యూ అధికారులు కూల్చివేసిన షెడ్డు పునఃనిర్మాణం కోసం సహకరించాలని పలువురు కాలనీవాసులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఆలయ షెడ్డు పునఃనిర్మాణానికి తన వంతుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

ఘనంగా బోనాల వేడుకలు



అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్



అబ్దుల్లాపూర్‌మెట్‌లో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న యువతులు



హస్తినాపురం డివిజన్ శివగంగాహిల్స్ కాలనీలో ముత్యాలమ్మ ఆలయంలో బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కొత్తపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో ఆదివారం బోనాల పండుగ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కొత్తపేటలోని పురాతన ప్రసన్న మహాకాళీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ మోహన్‌నగర్, సత్యానగర్, మారుతీనగర్, సీపీఓ కాలనీ, ఆర్‌బీఐ కాలనీ, న్యూ మారుతీనగర్, న్యూనాగోల్, శృంగేరి కాలనీల్లో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అమ్మవారి కృపతో ప్రజలంతా బాగుండాలి: ఎమ్మెల్యే

చంపాపేట : ముత్యాలమ్మ అమ్మవారి కృపతో ప్రజలంతా బాగుండాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని శివగంగా హిల్స్ కాలనీలో ఆదివారం సాయంత్రం కాలనీ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయంలో బోనాల వేడుకలను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురువాలని, ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, మాజీ అధ్యక్షుడు రఘుమారెడ్డి, కాలనీ ప్రతినిధులు భిక్షపతి, కొండల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలు ఈదమ్మ, పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. పలువురు అమ్మవార్లకు తొట్టెలను సమర్పించారు.

యువత సమాధులపై కూర్చుని గంజాయి తాగుతున్నారు

- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి వాడకం రోజు రోజుకూ ఎక్కువవుతున్నదని, ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. యువత పలు ప్రాంతాల్లో సమాధులపై కూర్చుని మరీ గంజాయి సేవిస్తున్నారని, పోలీసులు దీనిని అరికట్టాల్సిన అవసరం ఉన్నదని ఆమె పేర్కొన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని, దాంతో కొంత మంది యువకులు పనీపాటా లేక మత్తుకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై చేసే ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదని ఆమె విమర్శించారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో సంఘ వ్యతిరేక కార్యకలాపాలను చాలామటుకు అరికట్టవచ్చని, ప్రతి కాలనీలోనూ వీటిని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని సబితారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్గంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, శోభాఆనంద్‌రెడ్డి, లిక్కి మమతాకృష్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బీఆర్ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కాలనీ ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, నీలకంఠం అశోకచక్రవర్తి, శ్రీనివాస్, వెంకటేశ్, యశ్వంత్, శంకర్, సురేశ్, నర్సింహ, భాస్కర్, పుట్టగల్ల సంతోష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేయడమే లయన్స్‌క్లబ్ లక్ష్యం

- 320 హెచ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ గంపా నాగేశ్వర్‌రావు



లయన్స్‌క్లబ్ వార్షికోత్సవాల్లో గంప నాగేశ్వర్‌రావు, నందకిషోర్ తదితరులు

వనస్థలిపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు చేయడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని 320 హెచ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ గంపా నాగేశ్వర్‌రావు అన్నారు. లయన్స్‌క్లబ్ వనస్థలిపురం రెండవ వార్షికోత్సవాలు ఆదివారం వనస్థలిపురంలోని గణేష్ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నాగేశ్వర్‌రావు ముందుగా లయన్స్‌క్లబ్ వనస్థలిపురం అధ్యక్షుడు ఎస్.జె.ఎస్ నందకిషోర్, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎదురౌతున్న ఆరోగ్య సమస్యలు, ఆర్థికంగా వెనకబడిన వారికి వైద్య సేవలకుగాను నందకిషోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా సమాజానికి ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం లయన్స్‌క్లబ్ గొప్పతనం అన్నారు. వీటితో పాటు ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్, చాట్‌జిపిటి, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జెడ్పీ దూరయ్య, ఆర్సీ రమేష్, చీఫ్ అడ్వైజర్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత : పారిజాతారెడ్డి

- బాలాపూర్‌లో ఘనంగా మైసమ్మ విగ్రహావిష్కరణ



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక భావన ఎంతో ముఖ్యమని, తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బాలాపూర్‌లోని శ్రీసురమాంబ సమేత కంఠ మహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంతో పాటు శ్రీవనం మైసమ్మ ఆలయంలో నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ ఆలయాలను ప్రశాంతతకు ఆలవాలంగా తీర్చిదిద్దాలని, అప్పుడే భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందగలుగుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కళ్లెం ఎల్లారెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, తూళ్ల నరహరిగౌడ్, గండికోట యాదయ్య, ధన్‌రాజ్‌గౌడ్, కృష్ణాగౌడ్, సురేశ్‌గౌడ్, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం

మల్కాజిగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓ నవజాత శిశువు మృతదేహాన్ని మల్కాజిగిరి పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. మౌలాలి సర్దార్ పటేల్‌నగర్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఓ మగశిశువు మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పుడే పుట్టిన మగబిడ్డ మృతదేహంగా గుర్తించారు. ఈ దారుణానికి ఎవరు పాల్పడి ఉంటారన్న కోణంతో స్థానికులను, దగ్గర్లోని ఆస్పత్రుల్లోనూ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో ప్రయాణికురాలి బంగారు నగలు, నగదు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని కడపకు చెందిన పద్మజ(43) కాచిగూడకు రావడానికి చర్లపల్లి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు మహబూబ్‌నగర్ వద్ద ఉండగా హ్యాండ్ బ్యాగు సీటుపై పెట్టి బాత్రూమ్‌కు వెళ్లింది. తిరిగొచ్చినరికి హ్యాండ్ బ్యాగు దొంగలు తస్కరించారు. ఈ బ్యాగులో 20 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్, రూ.10వేల నగదు ఉన్నాయి. ఆదివారం పద్మజ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని న్యూ శివపురికాలనీలో రూ.47లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.15లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ మార్పిడి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి లింగోజిగూడ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం రోడ్డు విస్తరణకు పరిసర కాలనీల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సీఎం రోడ్డు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో న్యూశివపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారగోని రాజేష్‌గౌడ్, సురేష్‌రాజు, మధుసూదన్‌చారి, వెంకటేశ్వర్లు, నరేష్‌కుమార్, కిషోర్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్‌గౌడ్, పల్సం శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరణ్‌కుమార్, శ్రీకాంత్, గోవర్ధన్, అమీర్, విష్ణు, వెంకట్, భాను తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్‌లోని ఓ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దిడ్డి కృష్ణ, మాజీ కార్పొరేటర్ రాంబాబు తదితరులు

ఉప్పల్‌లోని ఓ ఇంట్లో డ్రగ్స్

(5వ పేజీ తరువాయి)

భరత్, రిషబ్‌షెట్టిలు నగరంలోని కస్టమర్స్‌కు రహస్యంగా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ చంద్ర, సిబ్బంది అఖిల్, వెంకటేశ్వర్లు సహా.. తన టీమ్‌తో కలిసి ఉప్పల్ పరిధిలో ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ ఎండీఎంఏ డ్రగ్, గంజాయి కలిగి ఉన్న భరత్, రిషబ్‌షెట్టిలను అరెస్టు చేశారు. వారి నుంచి 13.65 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 513 గ్రాముల గంజాయి స్వాధీనం చేసున్నారు. నిందితులతో పాటు.. స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

హార్స్ రేస్ బెట్టింగ్‌కు వాట్సాప్ గ్రూప్

(5వ పేజీ తరువాయి)

పోవడం, కుటుంబ కారణాలతో నగరానికి వచ్చాడు. మలక్‌పేటకు చెందిన రాజేష్‌కుమార్, విజయవాడకు చెందిన వెంకట్ చౌదరిలతో కలిసి హార్స్ రేస్ బెట్టింగ్‌లు నిర్వహించేవాడు. తర్వాత కాలంలో పంటర్లను ఆకర్షించి, సొంతంగా బెట్టింగ్ నిర్వహించాడు. అంతేకాక 'ఫైన్‌వెల్ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో వాట్సాప్ గ్రూప్ రూపొందించి, అందులో బెట్టింగ్‌లు స్వీకరించేవాడు. ఈ గ్రూపులో దేశ వ్యాప్తంగా 105 మంది పంటర్లు సభ్యులుగా ఉండగా, అందులో నగరానికి చెందిన వారు 20 మంది వరకు ఉన్నారు. వాట్సాప్ ద్వారా బెట్టింగ్‌లు తీసుకొని, ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించేవాడు. ఈ దందాపై పక్కా సమాచారమందుకున్న మల్కాజిగిరి ఎస్‌ఓటీ, జవహర్‌నగర్ పోలీసులు కలిసి దాడి చేశారు. బుకీ నాగేష్‌తోపాటు, పంటర్లు మణికొండకు చెందిన బొర్రా వెంకట్ చౌదరి, కృష్ణానగర్‌కు చెందిన చల్లా రమేష్‌బాబు, సఫిల్‌గూడకు చెందిన సునీల్‌ను అరెస్ట్ చేశారు. నగేష్ బ్యాంకు ఖాతా నుంచి రూ.8.34 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. బ్యాంకు ఖాతాలో ఉన్న 2.47 లక్షలను సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తును జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.



జ్ఞాపిక, అవార్డుతో డాక్టర్ టి.సురేందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సురేందర్‌కు నెల్సన్ మండేలా అవార్డు

మన్సూరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక సేవకుడు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి.సురేందర్‌కు నెల్సన్ మండేలా అంతర్జాతీయ అవార్డు వరించింది. పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణతో పాటు తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ఉచిత రక్తదాన శిబిరాలు, ఇతర ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది. మా మూవీ అసోసియేషన్ ఈసీ మెంబర్ డాక్టర్ చింతకుంట మాణిక్‌రావు, హాస్యబ్రహ్మ బిరుదాంకితుడు డాక్టర్ శంకర్‌నారాయణ చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ విశ్వగురు నెల్సన్ మండేలా అవార్డు తనపై సేవా బాధ్యతను మరింత పెంచిందని, తన సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరిస్తానన్నారు. కాగా సురేందర్‌కు ఇప్పటికే విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఐకాన్, కరోనా వారియర్, స్వదేశీ భూషణ్, సేవారత్న, పర్యావరణ మిత్ర, వనమాలి వంటి అవార్డులు రావడం గమనార్హం.

సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడిగా నర్సింహ



బాతరాజు నర్సింహ

ఎల్బీనగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యుడిగా ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన బాతరాజు నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో జరిగిన 17వ మహాసభలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజాసమస్యలపై ఉద్యమిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరిస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, కార్యవర్గసభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

- పట్టించుకునేవారు కరువు!



మహంకాళమ్మతోటలోని ప్రభుత్వ స్థలంలో కబ్జాదారుడు నిర్మించిన ఇటుకగోడ

చంపాపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో గజం స్థలం ధర వేలు, లక్షల్లో పలుకుతుంది. ఈజీ సంపాదన కోసం అక్రమార్కుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. చంపాపేట డివిజన్‌లోని మహంకాళమ్మతోట, నెహ్రూనగర్‌కాలనీ బాడర్‌లో ఉన్న శ్రీనిధి కన్‌స్ట్రక్షన్ అపార్టుమెంట్ ముందు తూర్పు వైపు గ్రామకంఠంలో సుమారు 50గజాల ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలంపై కొందరు అక్రమార్కులు కన్నేసి సాదా కాగితాలపై క్రయవిక్రయాలు జరుపుకుంటున్నట్లు తెలిసింది. ఆ స్థలం చుట్టూ నాలుగు నెలల కిందట స్థానికుడు ఇటుకగోడ నిర్మించాడు. స్థానికులు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపివేశారు. తిరిగి అతను స్థలం నాదే అంటూ గోడ నిర్మాణం చేపట్టేందుకు పూనుకున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కళ్లు తెరిచి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని, ఆ స్థలంలో ప్రభుత్వ నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.